క్లుప్తంగా

కేంద్ర మంత్రిని కలిసిన నాయకులు


ఉదయ్‌ప్రతాప్‌ను సన్మానిస్తున్న సంజయ్

ఖమ్మం మయూరిసెంటర్ (ఖమ్మం మామిళ్ల గూడెం) : కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్‌ను జిల్లా బీజేపీ నాయకులు సోమవారం కరీంనగర్‌లో కలిశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సన్నె ఉదయ్‌ప్రతాప్ జిల్లాలో బీజేపీ సభ్యత్వంలో సంస్థాగతంగా ముందుకెళ్తున్నట్లు వివరించారు. అనంతరం ఉదయ్‌ప్రతాప్‌ను బండి సంజయ్ సన్మానించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొంగల సత్యనారాయణ, డాక్టర్ శీలం పాపారావు, వీరభద్రం, లక్ష్మీనారాయణ గుప్త, నరేష్, శాసనాల సాయి, సుదర్శన్ పాల్గొన్నారు.

రేషన్‌డీలర్ల సంఘం కమిటీ ఎన్నిక


ఎన్నికైన కమిటీ సభ్యులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం నగర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నగర కమిటీని సోమవారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాలులో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ ఇబ్రహీం, ప్రధాన కార్యదర్శిగా సిద్ధంశెట్టి శేషగిరిరావు, కోశాధికారిగా చెన్నూరు ఉపేంద్రరావు, గౌరవాధ్యక్షుడిగా జానీమియాలను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాణోతు వెంకన్న, జానిమియా, దుర్గయ్య అభినందించారు.

విప్లవ దిక్సూచి ఫిడెల్ కాస్ట్రో

ఖమ్మంమయూరిసెంటర్: సామ్రాజ్యవాద వ్యతిరేక తిరుగుబాటు విప్లవానికి దిక్సూచి ఫిడెల్ కాస్ట్రో అని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు రావి శివరామకృష్ణ కొనియాడారు. నగరంలోని గిరి ప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఫిడెల్ కాస్ట్రో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్‌కుమార్, శివకౌశిక్, హరికృష్ణ, గోపి, ప్రతాప్, రాజు, నరేష్, సాయి ప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

రఘునాథపాలెం: మండలంలోని పాపటపల్లిలో సోమవారం టీడీపీ సభ్యత్వ నమోదును ఆ పార్టీ నాయకుడు కేతినేని హరిచంద్ర ప్రారంభించారు. కార్యకర్తల సంక్షేమం దృష్ట్యా రూ.5 లక్షల బీమా అమలుచేస్తున్నట్లు ఆయన తెలిపారు. నాయకులు కాముని నాగేశ్వరరావు, మహేష్, పిట్టల పవన్, పావురాల నాగబాబు, ఉషాబాబు, నాగన్న, లక్ష్మణ్‌చౌదరి, ఉపేందర్, సాయి, మల్లికార్జున్, కాజా పాల్గొన్నారు.

వైభవంగా ఇరుముడి

నేలకొండపల్లి: మండలంలోని రాయగూడెం స్థానిక ఆంజనేయస్వామి దేవాలయంలో అయ్యప్ప మాలధారణ భక్తుల ఇరుముడి కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు.. గురుస్వాములు వెంకయ్య, శ్రీను ఆధ్వర్యంలో ఇరుముడి కట్టుకుని శబరిమలకు బయలుదేరారు. కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బోయన వేణు, సేవాదళ్ పాలేరు కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, సాయినవీన్ తదితరులు ఉన్నారు.

సీపీఐది వందేళ్ల చరిత్ర..

ఖమ్మంరూరల్: కార్మిక, కర్షక, బడుగు, బలహీన వర్గాల పక్షాన అండగా నిలుస్తున్న ఒకే ఒక్క పార్టీ సీపీఐ అని, వందేళ్ల చరిత్ర ఉన్న పార్టీలో సభ్యత్వాన్ని స్వీకరించడం ఎంతో అదృష్టమని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. మండలంలోని కామంచికల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పార్టీ ఆవిర్భావం నుంచి పేదల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు చేస్తుందని, భవిష్యత్‌లో కూడా మరిన్ని ఉద్యమాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉందన్నారు. నాయకులు మిడకంటి చిన వెంకటరెడ్డి, చెరుకుపల్లి భాస్కర్, పుచ్చకాయల సుధాకర్, కె.కిషోర్‌రెడ్డి, వెంపటి సురేందర్, సత్తి, జంగాల ఉపేందర్, వెంకటరమణ, శంకర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దేవకీ నందన వాసుదేవ
వినోద	లక్కీ భాస్కర్
సాయిరాం	మెకానిక్ రాకీ
ఆదిత్య	రాధేకృష్ణ
శ్రీనివాస	అమరన్
సినీ గెలాక్సీ	జీబ్రా

- ఖమ్మం గాంధీచౌక్

మళ్లీ వారితోనే..

సర్వే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ బాధ్యతలు పాత ఆపరేటర్లకే

- ప్రజాపాలనలో తప్పులు నమోదుతో నేటికీ అవస్థలు
- సిబ్బందిని గుడ్డిగా నమ్ముతున్న అధికారులు


కేఎంసీలో సర్వే వివరాలు ఆన్‌లైన్ చేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఖమ్మం నగర పాలక సంస్థలో ముగింపు దశకు చేరింది. దీంతో అధికారులు ఆన్‌లైన్‌లో సమాచార నమోదు ప్రక్రియను చేపట్టారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. డేటా ఎంట్రీకి సంబంధించి ఆపరేటర్ల ఎంపికపై కేఎంసీలో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పాతవారికే ఈ బాధ్యతలను అప్పగించడంపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. ప్రజాపాలన దరఖాస్తుల నమోదు ప్రక్రియలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు చేసిన తప్పులతో వేలాది మంది ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత కరెంట్, గ్యాస్ సబ్సిడీ వంటి పథకాలను పొందలేకపోయారు. తమకు పథకాలు వర్తించడం లేదని కేఎంసీ కార్యాలయంకు వచ్చి ఆరా తీయగా.. డేటా ఎంట్రీ ఆపరేటర్లు చేసిన తప్పులు వెలుగులోకి వచ్చాయి. తాజాగా వారినే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అధికారులు నియమించడంతో అధికారుల తీరుపై విమర్శలు చేస్తున్నారు.

విద్యార్హత చూడకుండానే..?

క్షేత్ర స్థాయిలో ప్రజల నుంచి సేకరించిన సమాచారాన్ని ప్రభుత్వానికి అందించే సమయంలో ఎలాంటి తప్పులు లేకుండా సదరు సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందు కోసం కంప్యూటర్ వర్క్ రావడంతో పాటు ఇంగ్లీష్, తెలుగు భాషలపై పూర్తి అవగాహన ఉండాలి. చదవడం, రాయడం పూర్తిగా వచ్చి ఉండాలి. కాని కేఎంసీ అధికారులు డేటా ఎంట్రీ ఆపరేటర్ల ఎంపికలో మాత్రం అవేమి పరిశీలించడం లేదని తెలుస్తోంది. ఆపరేటర్లు ఏం చదివారో కూడా తెలుసుకోకుండా, వారి రెజ్యూమ్‌లు చూడకుండానే సమాచార నమోదు ప్రక్రియను అప్పగించేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కంప్యూటర్‌పై కొద్దిగొప్ప పరిజ్ఞానం ఉన్నా సరే ఆపరేటర్లుగా తీసుకుంటున్నారన్న చర్చ జరుగుతోంది. అయితే వీరిని నియమించడంలో ఒకరిద్దరు సిబ్బంది కీలకంగా వ్యవహరిస్తున్నారని, వీరు అధికారులను పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. వీరు తప్ప అర్హత ఉన్న వారు ఆపరేటర్లుగా దొరకరు అనే సమాధానాన్ని అధికారులకు చెప్పున్నట్లు తెలిసింది.

దీనిపై కేఎంసీ అధికారులను వివరణ కోరగా.. ఇంటింటి కుటుంబ సర్వే సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లు ముందుకు రావడం లేదని తెలిపారు. ఫలితంగా పాత వారితోనే ఈ ప్రక్రియ చేపట్టాల్సి వస్తోందని.. అయినా వారిలోనూ కొందరు ఆసక్తి చూపడం లేదని వెల్లడించారు.

జాగ్రత్తగా చేయాల్సిందే..

ప్రజాపాలన దరఖాస్తుల సమాచారం నమోదు ఒక రకమైన ప్రక్రియ అయితే.. కుటుంబ సర్వే నమోదు మరో రకమైన ప్రక్రియ. కుటుంబ సర్వేకు సంబంధించి ఎక్కువ సమాచారం కోడింగ్‌లోనే నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ కోడింగ్ నమోదు చేసే సమయంలో జాగ్రత్త పాటించకుంటే ప్రభుత్వానికి తప్పుడు సమాచారం అందే వీలుంది. అధికారులు పూర్తి స్థాయిలో ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చిన తర్వాతనే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను చేపడితే బాగుంటుందనే వాదనలు వినిపిస్తున్నారు. ఇంటింటి సర్వే చేసిన పలువురు ఎన్యుమరేటర్లు డిగ్రీలు, బీటెక్‌లు చేసిన వారు ఉండడంతో వారితోనే ఈ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ చేపడితే బాగుంటుందనేది మరి కొంత మంది సూచనలు చేస్తున్నట్లు తెలిసింది.

శరవేగంగా సర్వే వివరాల నమోదు


నేలకొండపల్లి: డేటాఎంట్రీని పరిశీలిస్తున్న నూరుద్దీన్


రఘునాథపాలెంలో..

రఘునాథపాలెం: కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను శరవేగంగా కొనసాగుతోంది. స్థానిక రైతువేదికలో శిక్షణ పొందిన 70 మంది డేటాఎంట్రీ ఆపరేటర్లతో రెండు షిఫ్టుల్లో నమోదు ప్రక్రియ ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. ఒక్కొక్కరు రోజుకు 25 మంది వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్టు డేటా ఎంట్రీ సిబ్బంది తెలిపారు. సోమవారం నాటికి సుమారు 1,500 కుటుంబాల వివరాలు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. ఎంపీడీఓ అశోక్, తహసీల్దార్ విల్సన్ బెన్నీ, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డిల పర్యవేక్షణలో ఎంట్రీ పనులు సాగుతున్నాయి.

సకాలంలో పూర్తి చేయాలి..

నేలకొండపల్లి: సమగ్ర సర్వే డేటా ఎంట్రీ నమోదును నిర్ణీత సమయంలో, తప్పులు దొర్లకుండా పూర్తిచేయాలని సర్వే పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నూరుద్దీన్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న డేటా ఎంట్రీని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. డేటాఎంట్రీ ఆపరేటర్లకు తగిన సౌకర్యాలు కల్పించాలని, మండల స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె.మానిక్‌రావ్, ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు వరి కొయ్యలను కాల్చొద్దు


రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ సరిత

ఖమ్మంరూరల్: రైతులు వరి కోతలు పూర్తయ్యాక ఎట్టి పరిస్థితుల్లోనూ వరి కొయ్యలను కాల్చొద్దని కూసుమంచి ఏడీఏ సరిత అన్నారు. సోమవారం మండలంలోని ముత్తగూడెంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, వరిపంట కోతలు పూర్తయిన నేలలను ఆమె పరిశీలించి రైతులతో మాట్లాడుతూ... వరి కొయ్యలను కాల్చడంతో నేలలో ఉండే సేంద్రియ కర్బనం, పంట పెరుగుదలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు నశించటంతో పాటు పర్యావరణానికి కూడా నష్టం వాటిల్లుతుందన్నారు. పంట అవశేషాలను, వరి కొయ్యలను నేలలో కలిపి దున్ని సింగిల్ సూపర్ పాస్ఫేట్ వేయటంతో కొయ్యలు మురిగి మంచి ఎరువుగా తయారై పంట ఎదుగులకు తోడ్పడుతుందన్నారు. అనంతరం పొన్నేకల్‌లోని జిన్నింగ్ మిల్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఉమానగేష్, ఏఈఓలు వంశీ, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

జీవో 12, 16లను రద్దు చేయాలని ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న న్యాయవాదులు

ఖమ్మంలీగల్ : నాన్ కేడర్ పీపీ పోస్టులను కేడర్ చేయవద్దని, జీవో 12, 16లను రద్దు చేయాలని డిమాండ్‌చేస్తూ సోమవారం జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో ధర్నా నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బార్ కౌన్సిల్ మెంబర్ కొల్లి సత్యనారాయణ, నిరంజన్ రెడ్డి, బిచ్చల తిరుమలరావు, కొత్త వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. కేడర్ పోస్టులు 50 శాతం, నాన్‌కేడర్ పోస్టులు 50 శాతం ఉండాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందన్నారు. కేడర్‌కు సంబంధించిన వారు ప్రమోషన్ల కోసం ఉద్యోగ సంఘాలతో ఒత్తిడి చేసి, ప్రభుత్వాలను బ్లాక్‌మెయిల్ చేస్తూ జీవో 16, 12 తీసుకొచ్చారన్నారు. బార్ సెక్రెటరీ చింత నిప్పు వెంకట్, ఓరుగంటి శేషగిరిరావు, తాళ్లూరి దిలీప్ చౌదరి, దిరిశాల కృష్ణారావు, పసుపులేటి శ్రీనివాసరావు, ముక్తేశ్వరరావు ఉన్నారు.

దేవాలయ భూముల సర్వే

నేలకొండపల్లి : మండలకేంద్రంలోని శ్రీ రాజగోపాలస్వామి దేవాలయంకు చెందిన భూములపై సోమవారం సర్వే ప్రారంభించారు. సింగారెడ్డిపాలెం రెవెన్యూ పరిధిలో దేవాలయ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని పలువురు ఫిర్యాదు చేయగా సోమవారం దేవాదాయ శాఖ ఈఓ శ్రీకాంత్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ప్రభుత్వ సర్వేయర్ రాంబాబు దేవాలయం భూములను పరిశీలించి హద్దులు నిర్ణయించారు. భూములను కౌలుకు తీసుకున్న రైతులు కూడ వేలం పాటలో పాడిన సరిపడ భూమి కనిపించటం లేదని ఆరోపణలు చేశారు. కాగా పూర్తి స్థాయిలో సర్వేను చేపట్టేందుకు సర్వే ప్రక్రియను వాయిదా వేశారు. శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం మాజీ చైర్మన్ రాయపూడి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు దోసపాటి శేఖర్, ప్రతినిధులు పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, విష్ణు, పూజారి రామానుజచార్యులు, సిబ్బంది కళ్యాణి, కృష్ణ పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ బలోపేతానికి కృషి


వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏఈఓలు

కామేపల్లి: ఆత్మకమిటీల నియామకంపై ప్రభుత్వానికి నివేదించి, వ్యవసాయ శాఖ బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డిని వ్యవసాయ విస్తరణ అధికారుల అధ్యక్షులు నాగుల్ మీరా, ఏఈఓలు కోరారు. సోమవారం మండలంలోని పాతలింగాలలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందించారు. రైతులు వ్యవసాయశాఖతో మమేకమై కలిసి పనిచేసే విధంగా వారికి జాబ్‌ఛార్ట్, కనీస విద్యార్హతలు, గౌరవ భృతి ఉండే విధంగా కృషి చేయాలన్నారు. ఏఈఓలు ప్రతిభ, శ్రీకన్య, జగదీశ్వర్, రవికుమార్, శ్రీకాంత్, శివకృష్ణ ఉన్నారు.

నిరసనను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న నాయకులు

కూసుమంచి: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక కార్యకలాపాలపై మంగళవారం అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిలపక్ష పార్టీల నాయకులు కోరారు. సోమవారం కూసుమంచిలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో రైతు సంఘం మండల కార్యదర్శి బిక్కసాని గంగాధర్, రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షులు బజ్జూరి వెంకట్రామిరెడ్డి తదితరులు మాట్లాడారు. రాజు, సైదులు, గన్యా నాయక్, బాలాజీ, వెంకట్రాములు పాల్గొన్నారు.

సింహగర్జనను జయప్రదం చేయండి

ఖమ్మం మయూరిసెంటర్ (ఖమ్మం మామిళ్లగూడెం): డిసెంబర్ 1న హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో నిర్వహించే మాలల సింహగర్జనను జయప్రదం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ రాష్ట్ర కో చైర్మన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ గోసోజు రమేష్, జిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం కోరారు. సోమవారం ఖమ్మం చర్చి కాంపౌండ్ కమ్యూనిటీ హాలులో విస్తృతస్థాయి సమావేశంలో దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు రవికుమార్, దామల్ల సత్యనారాయణ, పల్లా రాజశేఖర్, నారుమళ్ల వెంకన్న, జాకబ్ ప్రతాప్, బాబురావు, సుధాకర్, కనకరాజు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, లక్ష్మీనరసింహారావు, మల్లయ్య, భాస్కర్, చిరంజీవి, రాధాకృష్ణ, రమేష్, వీరబాబు, గంగాధర్, గాదరిబాబు, సంజీవరావు, కాశయ్య, ఏసురత్నం, సంగయ్య పాల్గొన్నారు.

గుంటుమల్లన్నకు పుష్పాలంకరణ


శ్రీ గుంటు మల్లన్నకు హారతి ఇస్తున్న అర్చకుడు

ఖమ్మంగాంధీచౌక్: కార్తీక సోమవారం సందర్భంగా నగరంలోని శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి ఆలయంలో మహిళలు, భక్తులు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పాలంకరణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చుండూరు రామకోటేశ్వరరావు పర్యవేక్షణలో అర్చకులు దాములూరి వీరభద్రరావు, దాములూరి కృష్ణశర్మలు పూజలు నిర్వహించారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో వ్రతాలు

నగరంలోని కాల్వొడ్డు శ్రీ సత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి దేవస్థానంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.

దీపోత్సవం

నగరంలోని సారథినగర్ ఎంబీ గార్డెన్స్ వద్ద ఉన్న శివాలయంలో సోమవారం రాత్రి కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభాపతి సిరికొండ మధుసూదనాచారి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. లయ అర్చకుడు బ్రహ్మశ్రీ సత్తెనపల్లి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు.

విన్‌ఫీల్డ్‌లో 'గ్రాండ్ పేరెంట్స్ డే'



ఖమ్మం సహకారనగర్: నగరంలోని విన్‌ఫీల్డ్ హైస్కూల్‌లో సోమవారం గ్రాండ్ పేరెంట్స్ డేను ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్లు గద్దె పుల్లారావు, పోలవరపు శ్రీకాంత్, మన్నే కిషోర్‌కుమార్‌లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తాతయ్యలు, నాయనమ్మలు, అమ్మమ్మలను సన్మానించారు. అనంతరం వారికి ఆటల పోటీలు నిర్వహించారు.

ఉత్తమ పాఠశాలగా 'బ్లూమింగ్ మైండ్స్'

ఖమ్మంఅర్బన్: ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని మెహదీపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఎన్‌సీసీలో ఉత్తమ పాఠశాలగా నగరంలోని బ్లూమింగ్‌మైండ్స్ పాఠశాల ఎంపికైనట్లు కరస్పాండెంట్ పి.అశోక్‌రెడ్డి తెలిపారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎన్‌సీసీ డైరెక్టరేట్ ప్రకటించిన వివిధ విభాగాల్లో అవార్డు అందుకున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఎన్‌సీసీ ఎఎన్‌ఓ వెంకటేశ్వర్లు , ఉపాధ్యాయులు ఉన్నారు

నిరంతర శ్రమే విజయానికి సోపానం


జ్ఞాపిక అందజేస్తున్న యాజమాన్యం

ఖమ్మంరూరల్: విద్యార్థులకు నిరంతర శ్రమే విజయానికి సోపానాలని, ఆదిశగా విద్యార్థులు చదువు విషయంలో శ్రద్ధ వహించాలని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కె.నవీన్‌బాబు తెలిపారు. సోమవారం కళాశాలలో విద్యార్థినులకు ఐటీసీ అకాడమీ ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఫినిషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లాయిబిలిటీ ట్రైనింగ్ ప్రోగ్రాంను ప్రారంభించారు. ఐటీసీ సీనియర్ రిలేషన్‌షిప్ మేనేజర్ గౌస్‌పాషా, ప్రిన్సిపాల్ బి.గోపాల్, డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, అధ్యాపకులు, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిన బీఆర్‌ఎస్ నాయకులు

తిరుమలాయపాలెం: లగచర్లలో రైతులపై కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మహబూబాబాద్‌లో చేపట్టిన మహాధర్నాకు మండలం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు తరలివెళ్లి ధర్నాలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్న, మాజీ ఎంపీపీ ఆలుదాసు ఆంజనేయులు, నాయకులు రవి, శ్రీను, శ్రీనివాస్, తనయ్‌ప్రకాశ్, వీరేష్, సురేష్ వెళ్లిన వారిలో ఉన్నారు.

కామేపల్లి: మహబూబాబాద్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యాన జరిగిన మహాధర్నాకు మండల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు తరలివెళ్లారు. నాయకులు మూడ్ కృష్ణప్రసాద్‌నాయక్, అంతోటి అచ్చయ్య, కృష్ణారెడ్డి, మల్లెంపాటి శ్రీనివాసరావు, పుచ్చకాయల ఉదయ్‌కుమార్, లకావత్ బీమానాయక్, బానోత్ రవి, రాయల చిన్న వెంకటేశ్వర్లు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెం గ్రామానికి చెందిన బొల్లు రామారావుకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కును ఖమ్మంలోని డిప్యూటీ సీఎం కార్యాలయంలో భట్టి వ్యక్తిగత సహాయకుడు శ్రీనివాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, బాబూరావు పాల్గొన్నారు.

వితరణ..


వాటర్ బాటిళ్లతో విద్యార్థులు

తిరుమలాయపాలెం: మండలంలోని ఎదుళ్లచెరువు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన కమతం రాము జన్మదినం సందర్భంగా సోమవారం వాటర్ బాటిళ్లు, మినరల్ వాటర్ కిట్‌ని, చాక్లెట్లను అందజేశారు. హెచ్‌ఎం రవి, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

ఖమ్మంరూరల్: మండలంలోని పోలేపల్లిలో గల కేంద్రీయ విద్యాలయంలో సోమవారం విద్యార్థులకు పోక్సో చట్టంపై న్యాయవాది టి.హైమావతి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిల్లలు ఎదుర్కొంటున్న వేధింపులను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. ప్రిన్సిపాల్ కవీంద్రరాయ్ కౌమార దశ విద్యా విధానం, యువతకు సంబంధించిన సమస్యలను వివరించారు.

మహా పాదయాత్రను జయప్రదం చేయండి

ఖమ్మం మయూరిసెంటర్ (ఖమ్మం మామిళ్లగూడెం) : ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ ఈనెల 27న కరీంనగర్ నుంచి వేములవాడ వరకు జరిగే తెలంగాణ ఉద్యమకారుల మహాపాదయాత్రను జయప్రదం చేయాలని ఉద్యమకారుల రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేవీ.కృష్ణారావు కోరారు. సోమవారం ఖమ్మంలోని అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. రవిచంద్ర చౌహాన్, ఉమా యాదవ్, వరలక్ష్మి, విజయకుమార్, అనంతలక్ష్మి, స్వరూప, పద్మ, ధనలక్ష్మి, కృష్ణవేణి ఉన్నారు.

లకారం పార్క్‌ను శుభ్రంగా ఉంచాలి


సిబ్బందికి సూచనలిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని లకారం ట్యాంక్‌బండ్‌ను సోమవారం నగర మేయర్ పునుకొల్లు నీరజ, హార్టికల్చర్ ఆఫీసర్ రాధిక సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. లకారం పార్క్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతీ మొక్కకు పాదులు ఉండేలా చూసుకోవాలన్నారు. పనిచేయని కాంట్రాక్టర్ ఆర్డర్ క్యాన్సిల్ చేస్తామని హెచ్చరించారు.

కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల ధర్నా

ఖమ్మంమయూరిసెంటర్: వికలాంగుల హక్కుల జాతర వేదిక ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజకు అందజేశారు. ఈ సందర్భంగా వేదిక అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ... కాంగ్రెస్ ఎన్నికల ముందు దివ్యాంగులకు రూ.4వేలు, రూ.6వేలు పెన్షన్ ఇస్తామని చెప్పి ఇంత వరకు ఆ పెన్షన్‌ను ఇవ్వడంలేదన్నారు. నాయకులు సిరికొండ ఉపేందర్, కోడిరెక్క శ్రీనివాసరావు, జగదీష్, లింగయ్య, పిట్టల వెంకన్న, హుస్సేన్, జాను, చెట్టు, లక్ష్మీనారాయణ, లక్ష్మీదేవి, అనురాధ, తులసి, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కామేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా డిప్యూటీ హార్టికల్చర్ అధికారి, మండల ప్రత్యేకాధికారి ఎంవి.మధుసూదన్ అన్నారు. సోమవారం మండలంలోని గోవింద్రాల, పాతలింగాల, టేకులతండా, కామేపల్లిలోని ప్రభుత్వ, ఆశ్రమ, కేజీబీవీ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకట్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక వనసమారాధన


వనసమారాధనలో పాల్గొన్న మహిళలు

నేలకొండపల్లి: మండలంలోని మంగ్రాజుపల్లి గ్రామంలో సోమవారం సామూహిక వనభోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుల, మత, పార్టీలకతీతంగా స్థానిక పాండయ్య మామిడి తోటలో నిర్వహించిన కార్యక్రమంలో 600 మంది హాజరై సహపంక్తి భోజనాలు చేశారు. మహిళలు, చిన్నారులు ఆటా, పాటలతో సందడి చేశారు. మాజీ సర్పంచ్ నెల్లూరి భద్రయ్య, కొమరగిరి హనుమంతరావు, తుమ్మా ఉపేందర్ ఉన్నారు.

వనసమారాధన విజయవంతంపై హర్షం

ఖమ్మంఅర్బన్: జిల్లా అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన యాదవ కురుమ బంధువుల వనసమారాధన కార్యక్రమాన్ని జయప్రదం చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ మహాసభ గౌరవాధ్యక్షుడు మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకట నరసయ్య, జిల్లా యాదవ యువజన అధ్యక్షుడు చిత్తారు సింహాద్రి యాదవ్ అందరికీ ధన్యవాదాలు తెలిపారు. సోమవారం మహాసభ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడగా మాజీ కార్పొరేటర్ చేతుల నాగేశ్వరరావు, కోటయ్య, సతీష్, బండారు ప్రభాకర్, ఆదినారాయణ, రమణ, చేతుల తిరుపతిరావు పాల్గొన్నారు.

కమ్మ సంఘం ఆధ్వర్యంలో..

నగరంలోని వెలుగుమట్ల పార్కులో కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనసమారాధనను విజయవంతం చేయడంపై బాధ్యులు గుడవర్తి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.